మీడియాతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్. చిత్రంలో సత్యవతి, బీఆర్ఎస్ నేతలు

తెలంగాణను బద్నాం చేసే కుట్ర

- నిర్మల వ్యాఖ్యల వెనక తెలంగాణ వ్యతిరేక శక్తులు
- కేసీఆర్ పాలనను చాలా చిన్నచూపుతో మాట్లాడారు
- కేంద్ర ఆర్థికమంత్రి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రాన్ని బద్నాం చేయాలనే కుట్రతోనే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో బాధ్యతారహితంగా మాట్లాడారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, పార్టీ నేతలు వాసుదేవరెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కిశోర్‌గౌడ్, రఘురామ్, రామచంద్రునాయక్, గాంధీనాయక్‌తో కలిసి మీడియాతో వినోద్‌కుమార్ మాట్లాడారు. కేసీఆర్ పదేండ్ల పాలనను చులకచేసిన మాట్లాడిన ఆమె తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణను 1956లో ఆంధ్రాతో కలిపినప్పుడే తెలంగాణ మిగులు బడ్జెట్‌తో ఉండేదని గుర్తుచేశారు. ఆర్థికవేత్త బీపీఆర్ విఠల్ కూడా తన పుస్తకంలో తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమని చెప్పారని, 2014లో కూడా తెలంగాణ ఏర్పడ్డప్పుడు కూడా మిగులు రాష్ట్రమేనని చెప్పారు. 'అప్పులు తెచ్చి కేసీఆర్ వృథాగా ఖర్చు చేయలేదు. సంపద, ఆస్తులు సృష్టించారు. కొత్త జిల్లాల్లో కలెక్టరేట్లు, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. రేవంత్‌రెడ్డి రోజూ కూర్చునే పోలీస్ కమాండ్ కంట్రోల్ కేసీఆర్ కట్టలేదా? కేసీఆర్ ప్రతి జిల్లాకూ మెడికల్ కాలేజీ కట్టారు.. అది ఆస్తా ? అప్పా?' అని నిలదీశారు.

> సీతారామన్ రెండు రోజులు తెలంగాణ పర్యటనకు వస్తే ఇక్కడి అభివృద్ధి తెలుస్తుంది. తెలంగాణకు ఇస్తామని విభజన చట్టంలో పేర్కొన్న అనేక హామీలు పెండింగ్‌లో ఉన్నాయి. ముందు సీతారామన్ వాటిని పరిష్కరించాలి.
>
> - బోయినపల్లి వినోద్‌కుమార్

> రేవంత్‌రెడ్డి తెలంగాణను బద్నాం చేస్తున్నట్టే.. సీతారామన్ కూడా బద్నాం చేసేలా మాట్లాడారు. తెలంగాణను బద్నాం చేసే కాంగ్రెస్, బీజేపీ కుట్రను ప్రజలు గమనిస్తున్నారు. వాటి ఆటలు సాగబోవు. సీతారామన్ వ్యాఖ్యల వెనక తెలంగాణ వ్యతిరేక శక్తులు ఉన్నాయి.
>
> - బోయినపల్లి వినోద్‌కుమార్

తెలంగాణకు ప్రత్యేకంగా ఏమిచ్చారు?

తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏమీ ఇవ్వకపోయినా నిర్మలాసీతారామన్ మాటలు వింటే నవ్వొచ్చిందని వినోద్‌కుమార్ ఎద్దేవా చేశారు. మెదక్ రైల్వేస్టేషన్ కట్టామని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్రం 20 ఏండ్ల తర్వాత అది పూర్తయ్యిందని, ఇందిరాగాంధీ పేరు ఎందుకు లాగుతున్నారని నిలదీశారు.

మోదీ చేసిన అప్పులపై మాట్లాడరా?: సత్యవతిరాథోడ్

విభజన చట్టం హామీలు నెరవేర్చడం కేంద్రం బాధ్యత అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ హితవుపలికారు. తెలుగు రాష్ట్రాల కోడలినంటూ చెప్పుకొనే నిర్మల.. తెలంగాణను అవమానించేలా మాట్లాడారని మండిపడ్డారు. తెలంగాణ అప్పుల గురించి మాట్లాడుతున్న నిర్మల ప్రధాని మోదీ వచ్చాక పెరిగిన అప్పుల గురించి మాట్లాడరా? అని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకే నిధులు తరలించారని విమర్శించారు. ఒక్క ములుగు నియోజకవర్గంలోనే కేసీఆర్ పది వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, జిల్లా పర్యటనకు వచ్చి చూస్తే జరిగిన అభివృద్ధి తెలుస్తుందని అన్నారు. తెలంగాణ మీద సీతారామన్ నిందలు వేయడం మానుకోవాలని సూచించారు. తెలంగాణను చిన్నగా చేసి చూపిస్తే నిర్మలాసీతారామన్ పెద్దగా అయిపోరని ఎద్దేవా చేశారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వెంకటేశ్

కేసీఆర్ బర్త్ డే ఘనంగా నిర్వహిస్తం

17న తెలంగాణ భవన్‌లో వేడుకలు • 71వ జన్మదినాన్ని పురస్కరించుకొని 71 కిలోల కేట్ కట్ చేసి సంబురాలు

గుడులు, మసీదులు, చర్చిల్లో ప్రార్థనలు • పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు

- రకరకాల తెలంగాణ వంటకాలతో విందు
- రాష్ట్రంలోని ప్రతి ఊరిలో కార్యక్రమాలు
- రక్తదానాలు, పండ్ల పంపిణీ, సామాజిక సేవ
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జాతిపిత, బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17న పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కేసీఆర్ 71వ జన్మదినం సందర్భంగా ఆ రోజు ఉదయం 10 గంటలకు 71 కిలోల భారీ కేక్ కట్ చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై వీడియో గీతాల ప్రదర్శన, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా కళాకారుల ఆటపాటలు, డప్పు చప్పుళ్లు, గిరిజన నృత్యాలు, ఉద్యమ స్ఫూర్తిని రలిగించిన గీతాల ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. వివిధ రకాల తెలంగాణ వంటలతో విందు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం పార్టీ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, పవన్, కార్పొరేటర్లు మన్నె కవితా రెడ్డి, వెంకటేశ్‌తో కలిసి తలసాని మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ జీవిత విశేషాలతో ప్రత్యేక సీడీని విడుదల చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రక్తదానాలు, పండ్ల పంపిణీతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కేసీఆర్ ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమాలను పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

14 ఏండ్లు అలుపెరగని పోరు

60 ఏండ్ల ప్రత్యేక రాష్ట్ర సాధన కలను 14 ఏండ్లు అలుపెరుగకుండా పోరాడి కేసీఆర్ సాధించారని తలసాని గుర్తుచేశారు. కొట్లాడి సాధించిన రాష్ట్రాన్ని పదేండ్ల పాలనలో దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని ప్రశంసించారు. అంతటి మహానుభావుడు, కారణజన్ముడు కేసీఆర్ పుట్టిన రోజు అంటే తెలంగాణ ప్రజలందరికీ పండుగ రోజు అని చెప్పారు. ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఊరూరా బీఆర్ఎస్ శ్రేణులు వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ప్రతి డివిజన్‌లో రక్తదాన శిబిరాలు వంటి సేవ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కేసీఆర్ పాలనాదక్షతను పార్టీ ముఖ్య నేతలతోపాటు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, జిల్లా, మండలస్థాయి నాయకులు కార్యకర్తలతో కలిసి వెలుగెత్తి చాటేలా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

సర్వే పూర్తిగా చేయాల్సిందే

కుట్ర పూరితంగా కులగణన చేశారని, మళ్లీ పూర్తిగా సర్వే చేయాలని తలసాని డిమాండ్ చేశారు. గ్రామాలు, పట్టణాల్లో సర్వే ఎక్కడా సరైన రీతిలో జరగలేదని, 60 లక్షల జనాభాను తక్కువ చేసి చూపారని మండిపడ్డారు. ఓటర్ లిస్ట్, కుటుంబ సమగ్ర సర్వే ప్రకారం చూసినా కులగణన లెక్కలు తప్పుగా ఉన్నాయని స్పష్టంచేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టబద్ధత చేస్తే లాభం లేదని కేంద్రం నిర్ణయం తీసుకోవాలని, కేసీఆర్ గతంలోనే బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీ తీర్మానం చేశారని గుర్తుచేశారు.

కేసీఆర్ పుట్టిన రోజున పెద్దఎత్తున మొక్కలు నాటాలి

- బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని ఈనెల 17న పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వృక్షార్చన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్ పుట్టిన రోజున వృక్షార్చన కార్యక్రమంలో పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు రాజు ప్రజాపతి, బొలిశెట్టి నితిన్, ప్రవీణ్‌చారి, నాగరాజు, పోత సుధీర్‌కుమార్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఫ్లెక్సీకి పుష్పాభిషేకం

- పంట పొలాల్లో ముందస్తుగా బర్త్‌డే వేడుకలు జరిపిన రైతులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత, 'రైతు బంధు'వు కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు ఆదిలాబాద్ జిల్లాలో రైతులు, ప్రజలు ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్చోడ మండలం ముక్రా(కే)లో రైతులు తమ పంట పొలాల్లో కేసీఆర్ ఫ్లెక్సీకి పుష్పాభిషేకం చేసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. 'కేసీఆర్ సారే రావాలి, మళ్లీ కారే రావాలి' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలితంగా రైతులు, ప్రజలు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, గాడ్గే సుభాష్, స్థానిక నాయకులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

రెడ్ల పాలిట భస్మాసుర హస్తం రేవంత్‌రెడ్డి

- రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): రెడ్డి వర్గానికి భస్మాసుర హస్తం సీఎం రేవంత్‌రెడ్డి అని, రెడ్లంతా ఆయనను బహిష్కరించాలని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలనే కాకుండా రెడ్లను కూడా మోసం చేసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ రెడ్లు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే రేవంత్‌రెడ్డి వారికే నష్టం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని సతీశ్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

జర్నలిస్టుల గొంతు నొక్కడం ప్రజాపాలనా?

- జర్నలిస్ట్ రాజ్‌కుమార్ అరెస్టు అక్రమం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- సైబర్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులతో భేటీ

దేవరుప్పుల, ఫిబ్రవరి 14 : ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం జర్నలిస్టుల గొంతునొక్కి, వారిపై ఉక్కుపాదం మోపాలని చూడటం ప్రజా పాలన అవుతుందా? అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆర్జీ టీవీ జర్నలిస్ట్ రాజ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్‌కుమార్ అరెస్ట్ విషయం తెలిసిన ఎర్రబెల్లి నేరుగా హైదరాబాద్‌లోని సైబర్ క్రైమ్ ఆఫీసుకు వెళ్లి డీసీపీతో పాటు, సంబంధిత అధికారులతో మాట్లాడారు. రాజ్‌కుమార్‌కు ధైర్యం చెప్పిన ఆయన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఆర్జీ టీవీ జర్నలిస్ట్ రాజ్‌కుమార్‌పై గతంలో అక్రమ కేసులు పెట్టి 14 రోజులు జైలుపాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, అతడిపై మరోమారు ఉక్కుపాదం మోపాలని చూస్తున్నదని మండిపడ్డారు. ప్రజాసమస్యలను ప్రభుత్వానికి తెలపడం, హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వ్యక్తుల గొంతులను యూట్యూబ్ ద్వారా ప్రచారం చేయడం ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల హక్కు అని, దాన్ని కాలరాయాలని చూస్తున్న ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కేటీఆర్ కొడంగల్ ప్రచారంలో భాగంగా అక్కడి ప్రజల ఆవేదనను తన యూట్యూబ్ చానల్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం అతను చేసిన తప్పా అని ప్రశ్నించారు. రాజ్‌కుమార్‌పై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని, అతడిని వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాజ్‌కుమార్‌కు బెయిల్ మంజూరైంది.

తెలంగాణలో కేసీఆర్‌కు జీవించే హక్కు లేదట!

- ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉవాచ
- ఉద్యమ నేతపై అనుచిత వ్యాఖ్యలు
- కేసీఆర్ కుటుంబం జనజీవన స్రవంతిలోనే లేదని గాంధీభవన్ సాక్షిగా దురుసు మాటలు
- మండిపడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు

> గతంలో ఉన్నట్టు చట్ట సభల్లో హుందాతనం ఈ రోజు తెలంగాణలో లేదు.. ఈ రోజు చట్ట సభల్లో మాట్లాడేవాళ్లకు ఎన్ని తిట్లు తిట్టావు? ఎంత చెడ్డగా తిట్టావు? ఎంత చెండాలంగా మాట్లాడావు? అనే పోటీ జరుగుతున్నది. ఇది తెలంగాణ సమాజానికి మంచిది కాదు.. రాజకీయ నాయకులు మాట్లాడుతుంటే చిన్న పిల్లలను టీవీ చానల్స్ మార్చాలనే దుస్థితి ఈ రోజు తెలంగాణలో వచ్చింది.
>
> -శుక్రవారం ఓ పుస్తకావిష్కరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

> కేసీఆర్‌కు అసలు తెలంగాణ సమాజంలోనే జీవించే హక్కు లేదు. జనజీవన స్రవంతిలో లేనోళ్ల ముందు వరుసలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పోంచపల్లి అంతా ఉన్నరు.
>
> - శుక్రవారం కులగణన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : ఉద్యమనేత, తెలంగాణ సాధకుడు, బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మరోమారు అనుచిత వ్యాఖ్యలు చేశారు. కులగణన, ఎస్సీ వర్గీకరణపై హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'సకల జనుల సర్వే లెక్కలన్నీ కాకిలెక్కలు.. ఇస్తరాకుల లెక్కగట్టి ఇదే కరెక్టని కాకి లెక్కలు చూపెట్టిండు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేపై మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదు.. సర్వేలో కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఆయన కొడుకు, అల్లుడు లెక్కలు రాపిస్తే ఆయనకు అడిగే అధికారం ఉండేది.. అసలు కేసీఆర్‌కు తెలంగాణ సమాజంలో జీవించే హక్కే లేదు' అంటూ దురుసుగా మాట్లాడారు. 'రాష్ట్రంలో సర్వేలో పాల్గొన్నవారంతా జనజీవన స్రవంతిలో ఉన్నవాళ్లు.. సర్వేలో పాల్గొనని 16 లక్షల మంది జనజీవన స్రవంతిలో లేనోళ్లు.. వీరిలో ముందు వరుసలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పోంచపల్లి అంతా ఉన్నరు' అంటూ మాట్లాడి కేసీఆర్ కుటుంబంపై తన అక్కసు వెళ్లగక్కారు. అంతకుముందు మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ రాసిన పుస్తకావిష్కరణ సభలో రేవంత్ మాట్లాడుతూ 'ఈ రోజు చట్ట సభల్లో మాట్లాడేవాళ్లకు ఎన్ని తిట్లు తిట్టావు? ఎంత చెడ్డగా తిట్టావు? ఎంత చెండాలంగా మాట్లాడావు? అనే పోటీ జరుగుతున్నది. ఇది తెలంగాణ సమాజానికి మంచిది కాదు' అంటూ సుభాషితాలు పలికి.. కొద్దిసేపటికే గాంధీభవన్‌లో కేసీఆర్‌పై నోరు పారేసుకోవడంపై రాజకీయవర్గాల్లో విస్మయం వ్యక్తమవుతున్నది. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులతో పాటు కేసీఆర్ అభిమానులు, తెలంగాణవాదులు భగ్గుమంటున్నారు.

పదవి పెరిగినా బుద్ధిమారలే

- నిన్ను తెలంగాణ ఛీకొడుతున్నా చిల్లర భాషేనా?
- జీవించే హక్కు ఎవరికిలేదో ప్రజలనే అడుగుదామా
- మా బహిష్కరణ కాదు .. నీ నిష్క్రమణ తప్పదు
- రాహుల్‌పై ఉన్న కోపాన్ని కేసీఆర్ మీద చూపిస్తవా?
- సర్వే, లీ సర్వేతో రేవంత్‌రెడ్డికి దిమాక్ కరాబైంది
- నీ నోరే నీ రాజకీయ జీవితానికి ఉరితాడైతది
- సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ నిప్పులు

> తెలంగాణను ఆవిష్కరించిన కేసీఆర్‌ను బహిష్కరిస్తవా? సూర్యుడి మీద ఉమ్మేస్తే ఏమవుతుందో తెలుసు కదా? మా బహిష్కరణ నీ వల్ల కాదు గాని, నీ నిష్క్రమణకు సమయం దగ్గర పడుతున్నది. సామాజిక బహిష్కరణ చేయాల్సివస్తే.. ప్రజలను పట్టపగలు మోసం చేస్తున్న నిన్ను ముందుగా చేయాలి రేవంత్..
>
> - హరీశ్‌రావు

> ఎవరికి సమాజంలో జీవించే హక్కులేదో ప్రజలను అడుగుదామా? నీ నియోజకవర్గం కొడంగల్.. లేక నీ సొంతూరు కొండారెడ్డిపల్లిలో అడుగుదామా? రేవంత్‌రెడ్డీ.. నీకు వచ్చే దమ్మున్నదా? రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ సమాజం ఛీత్కరిస్తున్నది. ఎంతమంది ఎన్ని విధాలుగా దుమ్మెత్తి పోసినా రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయమైతలేదు.
>
> - హరీశ్‌రావు

> కేసీఆర్‌ను తిడితే ఒక్కరోజు హెడ్‌లైన్స్‌లో ఉంటవేమో? కానీ తెలంగాణ చరిత్ర గతిని మార్చిన కేసీఆర్ స్థానం ప్రజల హృదయాల్లో పదిలమని తెలుసుకో.. రేవంత్‌రెడ్డి ఇదే భాషను కొనసాగించాలనుకుంటే జనజీవన స్రవంతిలో ఉండేందుకు అర్హుడే కాదు.
>
> - హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి పీఠం ఎక్కినా రేవంత్‌రెడ్డి బుద్ధిమాత్రం పెరగలేదని మాజీమంత్రి హరీశ్‌రావు ఫైరయ్యారు. తెలంగాణ సమాజంలో కేసీఆర్‌కు జీవించే హక్కులేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించటంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పనులు చేతగాక పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నాడని శుక్రవారం ఎక్స్ వేదికగా నిప్పులు చెరిగారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తెలంగాణ సమాజం ఛీత్కరిస్తున్నదని, ఎంతమంది దుమ్మెత్తి పోసినా రేవంత్‌రెడ్డికి జ్ఞానం రావడం లేదని విమర్శించారు. 'ఎలుకతోలు తెచ్చి ఎన్నాళ్లు ఉతికినా నలుపు నలుపేగాని తెలుపు కాదు' అనే సామెతను అక్షరాలా చాటుకుంటూ రేవంత్‌రెడ్డి తన దిగజారుడుతనాన్ని ప్రదర్శిస్తున్నాడని ధ్వజమెత్తారు. సీఎం పదవిలో ఉండి చిచోరా భాష మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రజలు ఛీ కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాహుల్‌పై కోపం కేసీఆర్ మీదనా?

'సీఎం రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీపై ఉన్న కోపాన్ని కేసీఆర్ మీద చూపిస్తే ఎట్లా?' అని హరీశ్ నిలదీశారు. 'ముఖ్యమంత్రిగా ఎవ్వరూ గుర్తించడం లేదని.. ఉనికి చాటుకొనేందుకు కేసీఆర్‌పై ప్రేలాపనలా? కేసీఆర్‌ను తిడితే ఒక్క రోజు హెడ్‌లైన్స్‌లో ఉంటవ్ కావచ్చు. కానీ కేసీఆర్ స్థానమే ప్రజల హృదయాల్లో ఉన్నదని తెలుసుకో' అని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డిది నాడైనా నేడైనా తెలంగాణ ద్రోహుల భాషేనని విమర్శించారు. అందుకే తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌పై పెద్దాచిన్నా అన్న గౌరవం కూడా లేకుండా దుర్భాషలాడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్న లేకి తనాన్ని, చిల్లర మనస్తత్వాన్ని తెలంగాణ సమాజం ఇప్పటికే అర్థం చేసుకున్నదని తెలిపారు.

సర్వే, లీ సర్వేతో రేవంత్‌కు దిమాక్ కరాబ్

ప్రజాస్వామ్య పంథాలోనే రేవంత్‌కు దిమ్మదిరిగే సమాధానం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కులగణన పేరుతో కుటిల రాజకీయం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్ హెచ్చరించారు. సర్వే సరిగా లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులే తూర్పార పడుతున్న విషయాన్ని ఉదహరించారు. 'కులగణన చేయలేదు..గాడిదగుడ్డు చేయలేదు అని సాక్షాత్తు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీనే అంటున్నా సీఎం రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా మా గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నది' అని మండిపడ్డారు. కులసర్వేలో కచ్చితమైన గణాంకాలు వచ్చాయని సత్తా ఉంటే కాంగ్రెస్ పార్టీ నాయకులందరితో చెప్పించాలని సవాల్ విసిరారు. 'కుల సర్వే ఉత్త ఎన్నికల గిమ్మిక్కు.. ఫెయిల్యూర్ మ్యాజిక్కు' అని కొట్టిపారేశారు. సర్వే కరెక్ట్ అని చెప్పుకొంటూనే మరోవైపు రీసర్వే అంటున్నారంటే రేవంత్‌రెడ్డికి దిమాక్ కరాబ్ అయిందనేందుకు నిదర్శనమని విమర్శించారు. 'సీఎం పదవి స్థాయిని చిల్లర మాటలతో దిగజార్చొద్దు.. ప్రశాంత తెలంగాణలో ఫ్యాక్షన్ వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నాలు ఎన్నటికీ సఫలం కావు.. నోరుమంచిదైతే ఊరు మంచిదవుతది.. రేవంత్ రాజకీయ జీవితానికి ఆయన నోరే ఉరిగా మారుతది' అని హెచ్చరించారు.

అభివృద్ధిని ఓర్వలేకే దుష్ప్రచారం

- బడ్జెట్‌లో కేటాయింపులపై కేంద్రం వివక్ష
- విభజన హామీల అమలులో విఫలం
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేకే కేంద్రం దుష్ప్రచారం చేస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య మండిపడ్డారు. తెలంగాణను అప్పులకుప్పలా మార్చారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత నరేందర్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎనిమిదిసార్లు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలాసీతారామన్‌కు అప్పులు కూడా ఆర్థికవ్యవస్థలో భాగమనే విషయం తెలియకపోవడం విడ్డూరమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దేశ ఆదాయంలో 85 శాతం అప్పులు చేసిన విషయాన్ని మర్చిపోయిన ఆమె రాష్ట్ర ఆదాయంలో కేవలం 26 శాతం అప్పులున్న తెలంగాణపై అక్కసు వెళ్లగక్కడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. దేశంలో 12 ప్రధాన రాష్ట్రాల కన్నా తెలంగాణ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

మీడియాతో మాట్లాడుతూ గోల్డ్‌మెడలిస్ట్ నందిని ఫొటో చూపిస్తున్న ప్రవీణ్‌కుమార్

కాంగ్రెస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం

- దారుణంగా గురుకులాల స్థితి
- బ్యాడ్మింటన్ గోల్డ్ మెడలిస్ట్ నందినికి ప్రోత్సాహం కరువు
- నిజాలు రాసిన టీ న్యూస్ రిపోర్టర్‌పై కేసు పెడ్తరా?
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం

> కేసీఆర్ హయాంలో గురుకుల సిబ్బందికి ప్రతి నెల మొదటి వారంలో జీతాలు వచ్చాయి. నేడు పదో తేదీ దాటినా వేతనాలు అందే పరిస్థితి లేదు. గురుకులాల్లో ప్రవేశానికి కేసీఆర్ హయంలో ఒక్క సీటుకు ముగ్గురు పోటీ పడేవారు. ఇప్పుడు మూడుసార్లు గడువు తేదీ పొడిగించినా స్పందన లేదు. విద్యాశాఖను సీఎం రేవంత్‌రెడ్డి తన వద్దే పెట్టుకున్నది ఆ రంగాన్ని కూకటివేళ్లతో పెకలించడానికా?
>
> - ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నీటి